# మూతపడని తలుపులు

కాముడు కళ్లు తెరచి కంగారు పడింది. తనెక్కడుంది? పింగాణీ చెక్కుల ఆసామీ చెపుతున్నాడు.

"అన్నయ్యగోరి ఎనకశక్రం పట్టేసింది, బిడ్డా! లేకపోతే బొస్సు కిందడిపొప్పయి పోయివోరూ అన్నయ్యగోరూ అరి సైకిలుబండీ, కోడంబాకం బిడ్జీ సొలో పులో - రైంయిమనొచ్చేత్తంది సైకిలుబండీ. బిరేకు లొగ్గేసినియ్, అన్నయ్యగో రెట్టాగాపుతారు? టాక్సీలు, బొస్సులు, లారీలు -- ఒకటేంటి? మంచి రద్దీ ఏల కూడాను." మాట్లాడుతుంటే అతని కుడికన్ను బాగా విచ్చుకుంటుంది. కింది పెదవి ముదరికొస్తుంది ఏవో తాగి చప్పరిస్తున్నట్టు. కాముడు రెప్పవాల్చకుండా అతని వంకే చూసింది. ఒక్కక్షణం - సగం మగతలో.

నూరేళ్ల చింతచెట్టు మొదలు అనుకోకుండా చొక్కా పంచీలో దూరి ప్రత్యక్షమైనట్టు ఆసామీ, చొక్కాకీ, పంచీ కింద చేతులూ, కాళ్లూ బెరళ్లు కట్టినట్టున్నాయి. కాస్త నిశితంగా చూస్తే, నల్లని దేహం మీద మరీ నల్లని వెంట్రుకలు ఒత్తుగా పరుచుకుని చర్మం పగలినట్టు కనిపిస్తూందని అర్థమైంది కాముడికి. అతని పెదవుల మీద బొద్దు మీసాలుండాలి. ఏమయ్యాయి? చటుక్కుని వందముఖాలు పైనించి తనచుట్టూ చూస్తున్నాయి. తను నూతిలోంచి అప్పుడే పైకి తేలుతూంది. తనచుట్టూ గుండ్రటి చీకటి. పైని - నూతి అంచు చుట్టూ - ఎన్నో ముఖాలు - బొమ్మలాంటి ముఖాలు.

"బిడ్డకి మెలుకువొచ్చింది" అన్నాడు పింగాణీ చెక్కుల ఆసామీ, అది నాటుసారా మెరపని అర్థమైంది కాముడికి. గుప్పుని కొట్టిన వాసన మళ్లీ ఆమెను నూతిలో ముంచెయ్యబోయింది. ఆమె ముక్కు తనంతట తానే చీదరించుకుంది.

"ఒరే. రాములూ! అవతలికి పో, ఆ కంపుకి మా ముక్కులే బద్దలైపోతుంటే, పాపం, ఆ అమ్మాయేం తట్టుకోగలదు" అందొక మెత్తని గొంతు

"వాడు నాటుసారాలో కూమ్ నది రొచ్చు ఏదో కలిపి తాగుతాడు ఒట్టి అమోనియా సరుకైతే అంత కంపుండదు" అంది ఇంకో గొంతు!

పింగాణీ చెక్కుల ఆసామీ కోపగించుకోలేదుగాని, వెనక్కి తగ్గాడు.

"సర్లేవయ్యా, తేరగా వొత్తే సీమ సొరకు నేనూ తాగుతా ఎంతైనా" అన్నాడు. తన్ను తాను సమర్థించుకుంటూ.

చటుక్కుని నూతిలోంచి పైకి తేలింది కాముడు పూర్తిగా నీటిపై అంచుకి, చుట్టూ చూసింది. సిగ్గుపడిపోయింది, లేవబోయింది.

"పడుకో, లేవద్దు, లేవలేవు, కుడికాలి ఎముక విరిగిందేమో, ఎక్స్-రే తీయించాలి."

డాక్టర్ గొంతులో అధికారముంది. శాసిస్తున్నట్టుంది. తియ్యగా శాసిస్తున్నట్టు ఆయన వంక చూసింది కాముడు. పెద్దముక్కు చిన్నకళ్లు పొట్టిగా చటుక్కుని వెనక్కి

పోయిన నుదురు. పలచగా కత్తిరించిన మీసాలు, ఎత్తు చెక్కులు. నల్లని కప్పుపట్టిన చిన్న తెల్లని పళ్లు. నవ్వినప్పుడు ఆయన ముఖమూ, తలాకూడా నవ్వుతున్నట్టు ఉంటుంది. ఆయన నవ్వింది ఆమె సంకోచం చూసి, ఆయన చీర ఒత్తిగించి ఆమె మీగాళ్లను నొక్కి చూస్తున్నాడు.

"డాక్టర్‌కీ, రోగికీ మధ్య ఆడా, మగా భేదం లేదు. సిగ్గూ సంకోచాలకు చోటులేదు.

ఆ వుచ్చారణలోనే ఆయనకు నాటకాల అలవాటుందని అర్థమై పోయింది కాముడికి.

"ఒక డాక్టరే కాదుగా, నాటక సమాజం, ఆస్పత్రి జనం అంతా. చుట్టూ మూగారు పైగా అంతా మగాళ్లు" అంది వెనక ఎప్పుడో విన్న మెత్తని గొంతు. డాక్టర్ అందరివంకా చిత్రంగా చూసాడు. పెదవులపై లేత చిరునవ్వులో ఏదో మందలింపు ఉంది. అందరూ తప్పుచేసినట్టు తొలగి పక్కకీ వెళ్లిపోయారు. అప్పుడు చూసింది కాముడు ఆయన్ని. రాములు (పింగాణీ చెక్కుల ఆసామీ) 'అన్నయ్యగా'రని పిలిచిన ఆయన్ని, అప్పుడు చటుక్కున అంతా గుర్తుకొచ్చింది.

తను నీరసంగా కాళ్లీడ్చుకుంటూ ఎత్తు ఎక్కుతూంది. అదేదో వంతెన, పైన తారురోడ్డు. కింద రైలు పట్టాలు. రోజల్లా తిండిలేదు. ఆకలి, నీరసం, చేతిలో ఇంచుమించు ఖాళీ ట్రంకు పెట్టెకూడా కాటా బస్తా బరువనిపిస్తుంది. కాళ్లు ఇనుప గదులు వేసినట్టు నేలను విడిచి పైకి లేవనట్టున్నాయి. రోడ్డు పక్కని అక్కడే పడుకుంటే? కాని, మర్యాదగా ఉండదు. శక్తిని కూడగట్టుకొని నడవలిసిందే, ఎంత దూరమైన సరే. చల్లని సముద్రపు గాలి వీపుకి ఎంత జోరుగా తగులుతున్నా, చెమటతో బ్లౌజు పూర్తిగా తడిసిపోయింది. జుట్టు తలకి అంటుకుపోతుంది. ఇంకొక్క అడుగు. ఇంకోకటి. అబ్బ! కూచుంటాను. ఇంక నడవలేను. అడుగు కదిపితే పడిపోతానేమో! ఒక్కక్షణం కళ్లు మూసుకొని నిలబడింది. చటుక్కుని కేకలు వినిపించాయి. కళ్లు తెరిచి చూసింది. పైనించి శరవేగంతో దొర్లుకుంటూ వస్తుంది ఒక సైకిలుబండి. కుంటివాళ్లు చేతులతో తొక్కునే మూడు చక్రాల సైకిలుబండి. అందులో కుంటి ఆసామీ, ఆయనే! ఆ మంచం పక్కని కూర్చున్నాయనే! బ్రేకు లాగుతున్నాడు. బ్రేకు వదిలేసినట్టుంది. బండి ఆగడం లేదు. తన దగ్గిరికి వచ్చేస్తూంది, తనకు ఎందుకు అడ్డుపడాలని తోచిందో పెట్టెతో సహా దాని ముందుకి వెళ్ళింది. తాకిడికి కింద పడిపోయింది. పెట్టె ఏమయింది? సైకిలుబండి తన కాలిమీంచి పోయింది. తను కుడిచేత్తో సైకిలు వెనక చక్రం పట్టుకుంది. సైకిలువేగం తన్ను కొంతదూరం రోడ్డు పల్లంలోకి లాగింది. అంతే. ఆ తరవాత గుర్తులేదు. ఏం జరిగిందో కుడిపక్క చుర్రుని మండింది. ఎడమచేత్తో తడిమిచూసుకుంది. బ్లౌజులేదు. కుడిపక్క చంకకిందనుంచి నడుముదాకా ప్లాస్టర్ పట్టీలున్నాయి. తనకి స్పృహ తప్పినప్పుడు డాక్టర్‌గారు వేసిఉంటారు. కాళ్లమీదాను, తొడలదాకా చిన్న చిన్న పట్టీలున్నాయి. సిగ్గుతో ఆమె ముఖం ఎర్రబడిపోయింది.

డాక్టర్ రెండు చెక్కలు చెరొక ప్రక్కావేసి వేసి కుడికాలు పొడుగునా గట్టిగా కట్టుకడుతున్నాడు. అన్నయ్యగారు నేలమీద కూర్చునే ఆమె కుడి చెయ్యి సానునయంగా నొక్కుతున్నాడు.

"నీ పేరేమిటమ్మా?" మెత్తగా అడిగారు అన్నయ్యగారు.

"కాముడు – అదే కామేశ్వరి" అంది ఆమె.

"ఏ ఊరు?"

"నగరి" కాస్త కళ్లు మూసుకుంది కాముడు. డాక్టర్ కట్టుకట్టడం ముగించాడు. ఎందుకో ఆమెకు ఆప్తుల మధ్య ఉన్నట్లు అనిపించింది. ఇంక అడక్కుండానే చెప్పడం మొదలెట్టింది. "మా అమ్మ పోయింది. అయినవాళ్లింకెవరూ లేరు, పోయేముందు నాకో అడ్రసు ఇచ్చింది. మా దూరపు చుట్టాలు నాకు మామయ్యల వరస – మద్రాసులో ఆయనకేదో ఆఫీసులో పని. అమ్మ గాజులమ్మిన బాపతు అరవై ఆరు రూపాయలున్నాయి. తనకి కర్మా అదీ చెయ్యద్దంది అమ్మ. కాని, చెయ్యకుండా ఎలాగ? సోమయాజులు బాబాయి అమ్మ ఆత్మ వైతరణి దాటదన్నాడు. చవగ్గానే చేయించాడు కర్మ అరవై రూపాయలయిపోయాయి. బస్సెక్కి మద్రాసొచ్చాను. మా అత్తయ్యవాళ్లు ఆ పాత అడ్రసులో లేరు. ఆఫీసు కనుక్కుని వెళ్లాను. మావయ్యగారికి బదిలీ అయిపోయిందట – ఢిల్లీ, ఎక్కడికిపోవాలో తెలియదు. ఊళ్లో పిచ్చిగా తిరుగుతున్నాను."–

"హు ఈ కాళ్లులేని వాణ్ణి రక్షించడానికి నీకాలు పోగొట్టుకున్నావా?" అన్నారు అన్నయ్యగారు. గొంతులో మెత్తని చిరునవ్వు ఉంది. ఆమె ఆయన వంక చూసింది. అదే ఆయన్ని స్పష్టంగా చూడ్డం. ఎంత పెద్దకళ్లు! ఆ చూపులు ఆదరణతో, జాలితో తడిగా ఉన్నాయి. గుండ్రటి ముఖం. పొట్టిగా కత్తిరించిన జుట్టు. ఆ ముఖం నిండుగా చల్లగా ఉంది. ఆయన గుండె కాయ అంతా అందులోనే ఉన్నట్టు. అలాంటి ముఖానికి కాళ్లెందుకు లేవు? అసలు ఎలా పోయాయి. ఎందుకు పోయాయి, కాళ్లే ఉండి నిలబడితే ఆరడుగుల ఆజానుబాహువు. చేతివేళ్లెంత పొడుగు! ఆమె గొంతులో ఏదో అడ్డుపడింది.

నా కాళ్ళూ బాగుపడతాయి. మీకూ కాళ్ళు వస్తాయి" అంది జంకుతున్న గొంతులో, ఆయన సమాధానం ఆకాశమంత విశాలంగా చిరునవ్వు నవ్వారు. ఆకాశమంత లోతైన బరువుంది. అందులో. డాక్టర్ గొంతు కాస్త కటువుగా ఆమెను పలకరించేసరికి అదిరిపడింది, కాముడు.

"పిచ్చివాగుడు వాక్క, ఈ నిద్రమాత్రలు మింగిపడుకో."

డాక్టర్ మాత్రలు నోట్లో వేసి నీళ్ళుపోశాడు. ఆయన నుదురు చిన్నదైంది. నవ్వినపుడు విశాలంగా మీదికి కదిలే జుట్టు, మబ్బులా ముఖాన్ని కమ్మేసింది. కాముడు కళ్ళు మూసుకుంది. తియ్యని నొప్పి శరీరాన్నీ, మనసునూ ఆవహించింది.

ఆ ఇంట్లో రోగిగా చేరిన మొదటి రోజునే అదొక బ్రహ్మచారి విడిది అని అర్థమైపోయింది కాముడికి. పదిమంది నాటకం మనుష్యులు ప్రతినిత్యం అక్కడే తినడం, పడుకోవడం. డాక్టర్‌కి నాటకాలంటే పిచ్చి అభిమానం. అయినా వైద్యంలోనూ గట్టివాడేనట. ఊళ్ళో ఏ గొడవొచ్చినా ఆయనముందు ఉంటాడట. వచ్చిన రోగుల్ని దబ్బడగడం కాముడు చూడలేదు. పొద్దున్న పది గంటలదాకా, సాయంత్రం మూడునించి ఏడుదాకా రోగులు తామర తంపరగా వస్తూ పోతుంటారు. మరీ కదల్లేని జబ్బు మనుషులు ఆ ఇంట్లోనే ఏదో ఒక మూల పడుకుంటారు. బాబు కాంపొండరు. డాక్టరే అతనికి తరిఫీదిచ్చి దగ్గర

పెట్టుకున్నాడట. ఆయన దర్శకత్వం కింద తయారయే నాటకాల్లో బాబు హీరో, పెద్దకళ్ళు, మంచి నుదురు, టోపి పెట్టుకున్నట్టు ముందుకొస్తుంది. జుట్టు - ఒత్తైన నల్లటి జుట్టు. చంటిపిల్లవాడి చూపులు, డాక్టర్ కంటే నాలుగైదు అంగుళాలు పొడుగు. అయినా, బాబాయ్ నాకో పావలా ఇయ్యరూ? సిగరెట్లు - అని ఎడంచేత్తో బుర్ర గోక్కుంటూ ఆయన్ని అడుగుతున్నప్పుడు బొత్తిగా చంటిపిల్లవాడు తండ్రి దగ్గర నిలబడి అడుగుతున్నట్టే అనిపిస్తుంది. సాధారణంగా డాక్టర్ జేబులో పావలా ఉండదు. ఆ సమయానికి ఏ స్నేహితుడు కూర్చున్నా సరే, కామ్రేడ్! అబ్బాయికో పావలా ఇవ్వండి" అంటాడు డాక్టర్. ఆ 'కామ్రేడ్" మొగమైనా చిట్లించుకోకుండా బాబుకి పావలా ఇస్తాడు. కాని, బాబు డాక్టర్ ఎదుట సిగరెట్టు కాల్చడం మాత్రం చెయ్యడు. ఆ ఇద్దరిమధ్య మర్యాదల్లో అది ముఖ్యమైనది. ఒక 'కామ్రేడ్' చేత బాబుకి డబ్బిస్తున్నప్పుడు, ఒకరోజున రాములు డాక్టర్‌తో చిరాకుగా అన్నాడు.

"ఏంటది. డాట్టరు బాబో! ఇంట్లో పొప్పులై పోయినాయ్, పణద్దార డబ్బాకాళీ. బాబు చిగరెట్ల కొచ్చిందా తొందర?" డాక్టర్ కాస్త అధికారయుతంగా, "ఒరే! పప్పులైపోతే పట్రా. కామ్రేడ్, వాడికో రూపాయ్యి, అంతేగాని, అనవసరంగా గొడవచెయ్యకు" అన్నాడు. కామ్రేడ్ చిల్లర లేదని అయిదు రూపాయల నోటిచ్చాడు. రాములు అది పట్టుకొని వెళ్ళిపోతూ, ఆ తురకోడిమీద ఈగవోల్నియ్యడు, బాబూ' అనుకున్నాడు పైకే.

బాబు తురకోడని అంతవరకు కాముడు ఊహించనైనా లేదు. ఎంత చక్కని తెలుగు! ఎంత తియ్యని ఉచ్చారణ!

"మా రాములుగాడు అసలు జన సంఘంలో చేరవలసినవాడు నూటికినూరుపాళ్ళా హిందువు. అయినా, బాబంటే వాడికి నిజంగా ద్వేషం లేదు. చాలా ఇష్టం, ఆ మధ్య వాడికి ఊపిరి సలపని దగ్గువస్తే రాత్రింబగళ్లు వాడిగుండెలు రాశాడు" అన్నాడు డాక్టర్.

"డాక్టర్! అన్నాడు కామ్రేడ్. "మీరు చేస్తున్నది చాలా తప్పు అసలు సిగరట్లు వాడికి పడదు, మీరు డాక్టరై ఉండి వాడికి సిగరెట్లకి డబ్బివ్వడం మొదటి తప్పు - ఇంట్లో వంటకి పప్పులూ, ఉప్పులూ లేవంటున్నాడు రాముడు. అటువంటప్పుడు వాటి సంగతి చూడకుండా. మీ దగ్గర డబ్బు లేనప్పుడు ఎవరినో అడిగి వాడికిప్పించడం చాలా పెద్దతప్పు ఏది ముఖ్యమో, ఏది అవసరమో..."

"అది చాలా పెద్ద ప్రశ్న కామ్రేడ్, ఏది ముఖ్యం? ఏది అవసరం? రాత్రి ఎనిమిదయేసరికి మీకు, నాకు సీసాలు ఉండాలి. లేని రోజుని మనం నరకబాధ పడిపోతాం. బాబు మనలాంటి మనిషే. సిగరెట్లు లేకపోతే వాడికి పిచ్చెక్కిపోతుంది" అన్నాడు డాక్టర్.

"అది సరేనండీ. వాడి ఊపిరితిత్తులు చెడిపోతే మీరే బాధపడాలిగా? వాడి ఆరోగ్యం కాపాడడానికి కాస్త మామూలు ఆరోగ్య సూత్రాలయినా వాడు పాటించేటట్లు మీరు చూడాలా, వద్దా?"

డాక్టర్ నుదురంతా వెనక్కి పోయేటట్లు నవ్వాడు.

"అందరూ ఆరోగ్య సూత్రాలు పాటిస్తే ఇంక డాక్టరెందుకు? డాక్టర్ తన వ్యాపారం బాగా అభివృద్ధి చేసుకోవాలంటే రోగాలు పెరగడానికి దోహదం చెయ్యాలి."

"ఆc! మీరు డాక్టర్ వ్యాపారం ఎంత బాగా సాగిస్తున్నారో నాకు తెలీదా? ఒక్క రోగిని మీరు డబ్బడగరు. ఇవ్వలేని వాళ్ళకు ఉచితంగా చేస్తున్నారు. సరే, ఇవ్వగలిగినవాడి దగ్గరకూడా పుచ్చుకోకపోతే బండి ఎలా నడుస్తుందండి?"

"బండి ఇప్పుడు ఆగిపోలేదుగా, నడుస్తూనే ఉంది. నడుస్తూనే ఉంటుందికూడా, ఇవ్వగలిగిన వాళ్ళకి వైద్యం చేసే డాక్టర్లు ఈ ఊళ్లో వేలు ఉన్నారు. ఇవ్వలేనివాళ్ల గతేమిటి?... ఇంతకీ అసలు విషయం వదిలేసి మనం డాక్టర్ల వృత్తి ధర్మాన్ని చర్చిస్తున్నాం, బాబుకి సిగరెట్టు ఒక వ్యసనం మనిషికి ఒక్కొక్క వ్యసనం. ఒక పెద్ద ప్లీడరుగారిని ఆయన కొడుకు దగ్గరకు తీసుకొచ్చాడు. ఆయనకి వయసువల్ల వచ్చే రోగాలన్నీ ఉన్నాయి అతి మూత్రం, గుండెనొప్పి, దగ్గు, ఆయాసం, రక్తపుపోటు వగైరా. పెద్ద డాక్టర్లంతా ఆయన కాఫీ, ముక్కుపొడుం మానెయ్యాలన్నారట. ఆయన మానలేదు. రహస్యంగా రెండూ సేవిస్తాడు. అవి ఆయనచేత మానిపించెయ్యాలన్నాడు కొడుకు. నేను – 'మిస్టర్! ఆయనకి దెబ్బయ్యోపడి, ఇంక ఆయన బతికి ఉంటే ఏ పదేళ్ళో బతుకు కాస్తా నరకం చేసి పెట్టమంటవా? లేకపోతే, ఆయన కిష్టమైన కాఫీ, ముక్కుపొడుం ఆయన కిచ్చి, బతికే నాలుగు రోజులైనా హాయిగా బతకనిమ్మంటావా?" అన్నాను."

ఇంతలో ఎవరో వచ్చి డాక్టరుగారిని అర్జంటుగా రమ్మని తీసుకుపోయారు. కామ్రేడ్ కాముడు మంచం ప్రక్కన కూర్చున్న అన్నయ్యగారి దగ్గరకొచ్చి "అన్నయ్యగారూ? వింటున్నారుగా మీ తమ్ముడి ధోరణి? ఈయన ఇంకెలా బాగుపడతాడండీ? మీరైనా చెప్పాలి. మా అబ్బాయి టైఫాయిడ్‌లో నెల్లాళ్ళు మందిచ్చారు. డబ్బిస్తే పుచ్చుకోరు. ఈ వందా మీరు ఆయన కివ్వండి" అన్నాడు.

అన్నయ్యగారు చల్లగా నవ్వారు. ఆయన నవ్వినపుడు కాముడికి నది ఒడ్డున చల్లగాలికి ఊగే రెల్లు పూలు గుర్తుకొచ్చాయి.

"వాడి వృత్తిలో నాకేం సంబంధం లేదు. మీరు ఇచ్చినప్పుడే వాడు తీసుకోకపోతే, నేను తీసుకుని వాడికివ్వడం న్యాయం కాదు" అన్నారాయన.

"మీరంటే ఆయనకు ఎంతో గౌరవం, మీరు తీసుకుంటే ఆయన నోరెత్తరు."

"ఆ గౌరవం నేను కాపాడుకోవాలంటే నేను తీసుకోకూడదు."

కామ్రేడ్ ముఖం ఇబ్బందిగా పెట్టాడు. ఆయన మనస్సు పీకుతుంది. కాముడికి ఆ క్షణంలో ఏ ఆవేశం వచ్చిందో, ఏ సాహసం ఆమెను పురికొల్పిందో ఆమె చెయ్యి జాపింది.

"నాకివ్వండి, నేనిస్తాను." అంది. కామ్రేడ్ బిత్తరపోయాడు. కాస్త సందేహించి అన్నయ్యగారి వంక చూశాడు. అన్నయ్యగారి కళ్లలో అర్థంకాని తడి వెలిగింది. కామ్రేడ్ ఆమెకు వందా ఇచ్చి తన అంతరాత్మను తృప్తిపరచుకున్నాడు. కామ్రేడ్ కాస్త తటపటాయించి వెళ్లిపోయాడు. అతనికేదో పెద్దబరువు తీరినట్టు అనిపించింది.

"నువ్వు చాలా ధైర్యవంతురాలివి – ఆనాడే నాకర్థమైంది" అన్నారు అన్నయ్యగారు.

కాముడు ముఖం జేవురించింది. సిగ్గుకాని సిగ్గుతో, అసలు తనెవరు? ఈ అన్నదమ్ములు, ఈ ఇల్లు, దీనికి సంబంధించిన మంచీ మర్యాద – వీటితో తనకేమిటి

సంబంధం? వీటిలో కలగజేసుకుని, కొన్నేళ్ళుగా రాతకోతలు లేకుండా అమలు జరుగుతున్న నియమాల్ని భంగపరచడానికి తనకెవరిచ్చారు అధికారం? అనాలోచితంగా ఆ సొమ్ము తీసుకున్నా. దాని అడుగున ఒక తర్కం - అజ్ఞాతమైన తర్కం లేకపోలేదు. తను దిక్కులేనిది. పేదరాలు. కాలువిరిగిన తన్ను ఇంట్లో పెట్టుకుని వైద్యం చేసారు డాక్టరుగారు. ఈ వైద్యానికి తను డబ్బు ఇచ్చుకోలేదు. ఇన్నాళ్లూ తను ఆ ఇంట్లో ఉన్నందుకు వాళ్ల తిండి తిన్నందుకు ఏదో విధంగా వాళ్ల ఋణం తీర్చుకోవాలి. దానికింతకన్నా మరోమార్గమేముంది?

డాక్టర్ తిరిగి రాగానే ఆయన కేవిధంగా చెప్పాలో, తను చేసింది ఏ విధంగా సమర్థించుకోవాలో... ఎన్నో ఆలోచించుకుంది, అవును, ఇన్నాళ్లూ ఇది ఆడ దిక్కులేని సంసారమైపోయింది. ఎందరో డాక్టర్‌గారి మంచితనాన్ని అవకాశంగా తీసుకొని ఆయన్ని మోసగిస్తున్నారు. డబ్బు ఇవ్వలేని వాళ్లు సరే. ఇవ్వగలిగిన వాళ్లనెందుకు వదిలెయ్యాలి? ఇవ్వగలిగిన ప్రతివాడిదగ్గరా ముక్కుపిండి వసూలు చెయ్యవలసిందే.

ఇన్నీ మనసులో అనుకుంది గాని, డాక్టర్‌గారు రావడంతోటే ఒక్క మాట అనలేకపోయింది. ఆయన రోగుల్ని చూస్తున్నాడు. పిలవలేకపోయింది. ఆ తరవాత ఇంట్లో రోగుల్ని చూస్తూ ఆయన ఆమె మంచం దగ్గరకొచ్చాడు. మామిడితోరణంలా నవ్వాడు.

"మనం ఎల్లా ఉన్నాం ఈవేళ?" ఆయనెప్పుడూ ఆమె నల్లాగే పలకరిస్తాడు. ఆ మనం ఆమె లోపల వెలితినంతా పూడ్చేస్తుంది. ఆమె గొంతు పూడిపోయింది. ధైర్యం చిక్కబట్టుకొని, తలగడ కింద నించి వందా తీసి చెయ్యి ఆయన వంక జాపింది. 'ఏమి'టని చూపుతోనే ప్రశ్నించాడు డాక్టర్.

"ఆ కామ్రేడంటారే. ఆయన ఇచ్చి వెళ్లారు. మీ కిమ్మని" అంది.

"నీ కెందుకిచ్చాడు?"

"మీ అన్నయ్యగారి కిస్తే ఆయన పుచ్చుకోలేదు. నేను పుచ్చుకున్నాను."

ఆమె ఇంక తెగించింది. తన మనస్సులో చెలరేగుతున్న వాదాలన్నీ పదునుపట్టి ప్రయోగించడానికి ధైర్యం చిక్కబట్టుకొంటూంది. కాని, డాక్టర్ ముఖం ముడుచుకొని డబ్బు తీసుకోకుండా వెళ్లిపోయాడు. హాలులో ఆ చివర ఉన్న ఆయన కుర్చీలో కూర్చున్నాడు. బాబు వచ్చి ఆయన పక్కని అణకువగా నిలబడ్డాడు.

"ఏరా సిగరెట్లకా? అదుగో - ఆ మంచంమీద పడుకుండే కాషియర్, ఆవిణ్ణి అడగరాపోయి" అన్నారు డాక్టర్. ఆ గొంతు వింటుంటే, కాముడి కన్నీళ్ళు గొంతుదాకా పొంగాయి. ఎక్కడలేని రోషం వచ్చింది పక్కనున్న అన్నగారి మొగం చూడలేకపోయింది. ఆయన తమ్ముడి వంక బుద్ధుడిలా చూస్తున్నాడు.

"అదికాదు బాబాయ్! సిగరెట్లున్నాయి. నాటకం రిహార్సల్సుకి అంతా చేరాం మన వరండాలో. ఈ వేళ నాటకమంతా ఒక్కసారన్నా చెయ్యాలి" అన్నాడు బాబు.

"ఈవేళ మీరే తంటాలు పడండి. నాకు ఓపిక లేదు" అన్నాడు నీరసంగా డాక్టర్.

ఆయన నీరసానికి తనే కారణమని కాముడికి తెలుసు. లేవగలిగితే అతని కాళ్లమీదపడి బతిమాలేదేమో, క్షమించమని. కాని, లేవలేదు. ఆమె మనస్సంతా వేడెక్కిపోతూంది.

"బాబాయ్ మీరు రావాలి. మా రిహార్సల్సుకి జీవం లేదు. ప్రాణం లేని కంకాళానికి మేం ఎన్ని అలంకారాలు చేసినా అది శోభించదు... మీరు జీవగర్ర. మీరు దిక్సూచి..."

అతని కంఠంలో కృతకమైన ఆవేశానికి నిజమైన కన్నీరు ఉబికింది. డాక్టర్ అదేమీ విననట్టు పరధ్యానంగా కూర్చున్నాడు.

"బాబాయ్! విరిసీ విరియని మొగ్గలం, మీ రశ్మి సోకితేగాని మాలో కళావికాసం కలగదు-

"కట్టి పెట్టరా నీ నాటకాల భాషా, అబద్ధపు ఆవేశమూ. అనుకున్నప్పుడల్లా కన్నీళ్ళు తెప్పించగలవులే. అందరికీ తెలుసా సంగతి. పో. వాడు రా డీ వేళ."

అన్నయ్యగారు అంత కటువుగా మాట్లాడడం కాముడు అంతవరకు ఎరగదు. తెల్లబోయి ఆయనవంక చూసింది. బాబు హడలిపోయాడు

"ఆఖరి రిహార్సలు గదా అనండి..." అంటూ నసిగాడు.

"పద, నేను చూస్తాను, ఆ రిహార్సలు సంగతి." బాబు గుటకేసి తుర్రుమన్నాడు. డాక్టర్ చేతుల మీద ఆనుకుని పోతున్న అన్నగారి వంక బాధగా చూశాడు.

అంతలో రాము వచ్చాడు. డాక్టర్‌గారి మనస్సు బాగుండలేదని కనిపెట్టాడు. స్వగతం లాగ అన్నాడు.

"ఏంటో, ఆ నాటకాలోళ్లంతా ఈ రేత్రికీణ్ణె తింది. ఏ రాత్రి ఒంటి గంటకో తే - తెత్తావా, పంపెదా అంటారు. ఇంట్లో సూత్తే శేరు బియ్యం ఉన్నాయి. పొప్పుల్లేవు, సింతపండయిపోయింది. నూని గిర్దెడుంది. ఎట్టాగో ఎంటో?"

కాముడు డాక్టర్‌వంకా, రాములువంకా చూసింది. డాక్టర్ ముఖమైనా వాడివంక తిప్పలేదు. శిలావిగ్రహంలా కూర్చున్నాడు. కాముడు సగం లేచి కూర్చుంది. ఉద్రేకంలాంటి ఉద్రేకంతో, "రాములు! ఇదిగో డబ్బు, ఏం కావాలో అన్నీ పట్రా. వందకీ సరిపడ సామానంత తెచ్చెయ్యి ఈ వేళ" అంది.

రాములు తెల్లబోయి చూసాడు నూరు రూపాయల నోటువంక అదేదో ఎన్నడూ చూడని వింతపురుగైనట్లు. తేరుకున్నాడు. నవ్వుమొగంతో చెయ్యి జాపి, "అమ్మ నా తల్లే" అనేసి, అది తీసుకుని ఇంక డాక్టర్ వంక తిరగన్న చూడకుండా పరుగెత్తాడు. కాముడు డాక్టర్ వైపు తిరిగింది. నిర్లక్ష్యం నటిస్తూ, 'నువ్వేం చేస్తావో చేసుకో' మన్నట్లు.

డాక్టర్ క్షణంపాటు ఆమెవంక రెప్పవెయ్యకుండా చూశాడు. ఆమె మరింత నిర్భయంగా ఆయనవంక చూసింది. చటుక్కుని ఆయన పగలబడి నవ్వాడు. నవ్వుతున్నప్పుడు నుదురంతా పైకి పోయింది. కళ్లలో నీళ్ళొచ్చేదాకా నవ్వాడు డాక్టర్. ఇంక నవ్వలేక, దగ్గొచ్చేదాకా.

గాలిపోయిన బుడగలా తలగడమీద వాలిపోయింది. కాముడు

డాక్టర్ ప్లాస్టరు కత్తిరించేశాడు. కాముడు కాలు మాత్రం కర్రలా బిగుసుకుపోయే ఉంది. మరునాడు డాక్టర్ ఆమె కాస్త నడవడం అలవాటు చేసుకోవాలన్నాడు. ఆమె లేచి

నిలబడింది. కాస్త తూలింది. ఆయన భుజం ఆసరా ఇచ్చి నడవమన్నాడు. ఆమె నాలుగడుగులు వేసింది. మోకాలు కాస్త వంగుతున్నట్లు అనిపించింది. డాక్టర్ భుజం ఆసరా జన్మ జన్మలకు ఆశ్రయం; లాగ అనిపించింది. కాలు నయంకాగానే వెళ్లిపోవాలి. ఎక్కడికి పోగలదు? అయితే, ఇక్కడెలా ఉంటుంది? డాక్టరు ఆమెను తలుపుదాకా తీసుకెళ్లాడు. ఆగాడు. ఆమె ఆయనవంక చూసింది. చిరునవ్వుతో ఆయన చెక్కులు ముడతపడ్డాయి. నుదురుపైకి కదిలింది. వెనక్కి తలుపువైపు చూశాడు. చిత్రమైన, గంభీరమైన దస్తూరితో ఆ తలుపుమీద రాసి ఉంది – "ఈ తలుపులు మూతపడవు" అని

"అన్నయ్య రాశాడు. మేమీ ఇంట్లో ప్రవేశించినప్పటినించి ఈ తలుపులు మూసి గడియవెయ్యలేదు. రాత్రీ, పగలు తెరిచే ఉంటాయి. ఎప్పుడెవరొస్తారో, ఎవరికే అవసరమొస్తుందో మనతోటి; ఈ తలుపులు మొయ్యడానికి వీల్లేదన్నాడు అన్నయ్య, ఈ ఇంట్లోకి ఎంతో మంది వచ్చారు – రాములు, బాబు, ఎంతోమంది. వచ్చిన వాళ్లు మా కుటుంబంలో కలిసి పోయారు. తిరిగి బయటికి వెళ్లిపోలేదు."

తన మనసులో ఆలోచనలు ఈయనెల్లా చదవగలిగాడు? ఈయన కేదయినా అతీంద్రియ జ్ఞానముందా?

"ఎక్కడికి పోవాలో కూడా తోచడంలేదు" అంది కాముడు తలవంచుకొని.

"చేరవలసిన చోటికే చేరావు. ఇంకెక్కడికి పోతావు?"

కాముడు ఆ ఇంట్లో స్థిరపడి పోయింది.

ఆ ఇల్లు ఒక డాబా పక్కనే ఉంది. డాబాకి, ఇంటికీ మధ్య సన్నని సందులో ఏవో పూలమొక్కలు, ఏడాదిలో ఆరు నెలలు ఎండపడదు ఆ సందులోకి. అందుచేత పువ్వులు, ఆకులు కాస్త రంగు తగ్గి ఉంటాయి. జబ్బు చేసిన ప్రాణుల్లాగ.

దొడ్డివైపు పూర్తి చేసిన వరండా ఎర్రటి ఇటుకల గోడ సగం దాకా లేచి ఆగిపోయింది. ఇంక లేవనట్టు. ఇల్లుగల ఆసామికి అక్కడికొచ్చేసరికి డబ్బు అయిపోయి ఉంటుంది. ఆ వరండాలోనే నాటకాల రిహార్సల్సు. రాత్రిపూట బాబు, మిగతా నాటకాల జనం అక్కడే పడుకుంటారు.

ముందు చిన్న ఆవరణ. అశోక వృక్షాల మధ్య ఒక సిమ్మెంటు తిన్నె. వీధిలో దీపం వెలుగుదానిమీద పడుతుంటుంది. అక్కడ పదిమంది కాలేజీ విద్యార్థులు చేరుతుంటారు. వాళ్లకి అన్నయ్యగారు. ఆయన అంతవరకు చదువుకున్నారని కాముడనుకోలేదు. రాములు చెప్పాడు. ఆయన ఎం.ఏ చదుతుండగా కాళ్లు పోయాయని.

ఒకరోజుని ఆమె డాక్టర్ని అడిగింది :–

"ఏవండీ! అన్నయ్యగారి కాళ్లు ఎలా పోయాయి?" అని.

"విధి."

అన్నయ్యగారి గొంతు విని ఇద్దరూ అదిరిపడ్డారు. చాలా తేలికగా నవ్వుతో కలిపి అన్నారా మాట.

"విధి కాదు, స్వయంకృతాపరాధం" అన్నాడు డాక్టర్ ఆవేశంలో ఇంక అక్కడ నిలబడలేనట్టు చర్రున వెళ్లిపోయాడు. కాముడు, బిత్తరపోయింది.

"కాముడూ! నా కాళ్ళుపోయిన సంగతి వాడి దగ్గర ఎన్నడూ ఎత్తద్దు" అన్నారు అన్నయ్యగారు.

"ఆయన డాక్టరుకదా, మీకిది పుట్టుకతో వచ్చినది కాదు. అందుచేత బాగు చెయ్యడానికి వీలవుతుందేమోనని అడిగాను."

"వాడు చెయ్యవలసిన ప్రయత్నాలన్నీ చేసాడు. లాభం లేకపోయింది. అదేవాడి బాధ. నాకు మాత్రం విచారమేమీ లేదు. సుమా. కాళ్ళు పోయిన దగ్గర్నుంచీ నాకు పలుకుబడి పెరిగింది. అధికారం పెరిగింది. నా మాటకు తిరుగులేదీ ఇంట్లో. ఈ ఇంటికొచ్చే రోగుల్ని చూస్తుంటాను. తనమీద తాను జాలిపడ్డం కన్నా పతనం మరొకటి లేదు మనిషికి. శాశ్వతంగా కాళ్ళుపోయిన నేను పక్కన కూర్చుని ఓదారుస్తుంటే వాళ్ళకి ఎంతో ఉపశమనంగా ఉంటుంది. అయ్యో, మంచి వయస్సులో కాళ్ళు పోయిన ఈయన మన్ని ఓదారుస్తున్నాడే, ఆయన కష్టం కన్న మనది ఎక్కువా? అని కాస్త సిగ్గుపడుతుంటారు కూడా. తమకన్న ఎక్కువ కష్టాల్లో ఉన్న వాళ్ళు ఎందరో ఉన్నారన్న సంగతి గ్రహిస్తారు. ఇతరుల బాధల్ని చూసి జాలిపడ్డం నేర్చుకుంటారు. తమ సొంత బాధల్ని మరిచిపోతారు.

'కలిసి ఉంటే కలదు కష్టం' అన్న నాటకాన్ని అన్నయ్యగారు రాశారు. ప్రత్యేకాంధ్రోద్యమాన్ని దృష్టిలో పెట్టుకొని ఒక సమిష్టి కుటుంబంలో పుట్టిన కలతలను ఆయన హాస్య, వ్యంగ్య ధోరణిలో నాటకీయంగా చిత్రించారు. అది ప్రదర్శించి డబ్బు వసూలుచేసి, ఆంధ్రోద్యమంలో కష్టనష్టాలకు గురి అయిన వారికి అందజెయ్యాలని డాక్టర్ సంకల్పం. బాబుకు హీరో పాత్ర ఇస్తే అన్నయ్యగారు వద్దన్నారు. తన కథానాయకుడు వట్టి అందగాడైతే చాలదన్నారు. తమ్ముడే ఆ వేషం వేసి తీరాలన్నారు. అన్నయ్యగారి అభిరుచి డాక్టర్‌కి గీటురాయి. ఆయన కళాభిజ్ఞతమీద గౌరవం. బాబు చిన్నబుచ్చుకున్నా, నాటకం రిహార్సల్స్ జరుగుతున్నప్పుడు, తనైతే ఆ వేషం మరొక రకంగా 'భాసించేదని, అన్నయ్యగారు, సృష్టించిన పాత్రకు ఆమడదూరంలో ఉండేదని అతనే ఒప్పుకున్నాడు. పది రోజులు రిహార్సలు అయాక నాయక పాత్ర వేయనున్న కిరాయి నటి కుమారి. కుమారి తనకు ప్రదర్శనానికి వంద రూపాయలు కావాలంది.

"కుమారీ! ఇది ఆంధ్రదేశంకోసం, అక్కడ నానా అగచాట్ల పాలవుతున్న ప్రజలకోసం, భయంకర బాధలకు గురి అయిన త్యాగధనుల కోసం..." అంటూ తన విలక్షణ భాషలో ప్రారంభించాడు బాబు.

"నోరుముయ్యరా! ఆవిడకి ఆ సంగతి తెలియకే అడిగిందా వంద రూపాయలు? అమ్మాయ్, నువ్వీ వేషం వెయ్యక్కర్లేదు" అన్నారు అన్నయ్యగారు.

"కాముడు వేస్తుంది వేషం. రా, కాముడూ?" అన్నాడు డాక్టర్

"నేనా!!" అంది కాముడు. ఆమెకు ముచ్చెమటలు పోసాయి.

కాముడు వేసిన వేషం పేరు ప్రియంవద. డాక్టర్ రోజుకి పదిసార్లయినా 'ప్రియా' అని పిలుస్తూంటే ఆమె మనస్సులో చెప్పరాని విద్యుత్తరంగాలు ప్రవహించేవి. నిద్రలోకూడా ఆ పిలుపే వినిపించేది. పగటికలలో కూడా అదే పిలుపు. ఆ పిలుపుకోసం ఆమె ఎదురుచూసేది, హృదయమంతా విచ్చుకుని, అదొక తీరని దాహం. ఆ దాహం ఆమెకొక

వింత కాంతిని చేకూర్చింది. నాటక ప్రదర్శనంలో ఆ వెలుగే ఆమెను అద్భుతనటిని చేసింది. నాటకానికి ఆమె ప్రాణం. ప్రేక్షకులకు ఆమె ఆప్త నటీమణి. నాటకం అయిన తరవాత డాక్టర్, అతిథిగా వచ్చిన ప్రత్యేకాంధ్ర నాయకుడికి పదహారువేల రూపాయల సంచీ – ఆనాటి నాటకాదాయం – కాముడు చేత ఇప్పించేడు. ఆ రాత్రి నేలమీద లేదు కాముడు. ఆ రాత్రి పక్కమీద పడుకోబుద్ధి కాలేదు కాముడికి. తక్కిన నాటకం జనమంతా శారీరకంగా, మానసికంగా అలసిపోయారు. మద్రాసు నగరంతోపాటు సుఖ నిద్రలో మునిగిపోయారు. కాముడు మాత్రం వీధివైపు సిమెంటు తిన్నెమీద కూర్చుంది. ఆకాశంలో గుడ్డి వెన్నెల చిందుతున్న చంద్రుడు, అలసంగా ఆడుతున్న అశోక వృక్షాల రెమ్మలు మత్తుగా మేలుకుని ఉన్నాయి. ఆమెకు తోడుగా.

"కాముడూ!" అన్న పిలుపు విని ఆమె అదిరిపడింది. డాక్టర్ వచ్చి ఆమె పక్కని ఎప్పుడు కూర్చున్నాడో ఆమె ఎరగదు. నాటకంలో 'ప్రియ' ఇప్పుడు 'కాముడు' అయిపోయింది. ఆ మార్పు డాక్టర్ గొంతులోనే ఉంది. ఆమె గొంతు తడి ఆరిపోయింది.

"నాకు నటనంటే ఏమిటో తెలియదు"

"నాకు తెలుసు"

"నేను మాత్రం నటించగలిగానంటే మీరే కారణం."

"అదీ తెలుసు నువ్వు నటించ లేదు. నువ్వా పాత్రవైపోయావు. ఇంకా ఆ 'ప్రియనే' అనుకుంటున్నావు."

ఆమె అతనివంక చూసింది. అతడు ఆకాశం వంక తలెత్తాడు.

"నేను మాత్రం నాటకంలో పాత్రని కాను. వట్టి డాక్టర్ని."

ఆమె కళ్లు తిరిగాయి. బాధగా మూసుకుంది, ఎవరో గుండెలు పిండుతున్నట్టు.

"అనవసరపు ఆశలేవీ పెట్టుకోకు."

అతను లేచి అడుగువేశాడు. ఆమె అతని చెయ్యి పట్టుకుంది. అతను మళ్లీ కూర్చోలేదు. చెయ్యి లాక్కోనూ లేదు. ఆకాశంవంకే చూస్తూ అన్నాడు.

"నన్ను కిందకి దిగలాగడానికి ప్రయత్నించకు... నేనూ మనిషినే"

అయితే, నేలమీదకి దిగడానికి ఎందుకు భయం?"

డాక్టర్ నిట్టూర్చాడు.

"నాకథ నీకు తెలియదు – మా అన్న దమ్ముల కథ."

"చెప్పండి."

అతను కూర్చున్నాడు. అశోక వృక్షం రెమ్మల వంక చూస్తూ గుర్తు తెచ్చుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. అక్కడంతా రాసిపెట్టి ఉన్నట్టు.

"నేను ఎమ్.బి మూడో ఏడు చదువుతున్నాను. అన్నయ్య ఎమ్.ఎ ఫైనల్ ఉన్నాడు. ఫుట్‌బాల్ ఆడేవాడు. బాగా ఆడేవాడు. వాడికి మంచి స్కాలర్‌షిప్ ఉండేది. ట్యూషన్లు చెప్పి నన్ను చదివించాడు. కట్టుగుడ్డలు తప్ప మాకు ఆస్తి ఏమీలేదు. ఒక టోర్నమెంటులో వాడికి కాలికి దెబ్బ తగిలింది. చిన్న దెబ్బనుకున్నారు. క్రమంగా మోకాలు బిగిసిపోయింది. మా ప్రొఫెసర్లకి చూపించాను. వెల్లూరు తీసుకెళ్లమన్నారు. అందుకు డబ్బులేదు. దానికి

సంబంధించిన పుస్తకాలు చదివి నేను వైద్యం ప్రారంభించాను. ఫలితం... రెండు నెలల్లో వాడి రెండు కాళ్లూ పోయాయి. ఎండిపోయాయి... వాడు చదువు మానేశాడు. నేనూ చదువు మానేస్తానన్నాను. ట్యూషన్లు చెబుతూనే నన్ను చదివించాడు. మెడిసిన్ పాసయ్యాను... మొదట్లో బాగా డబ్బు వసూలు చేసేవాణ్ణి రోగుల దగ్గర, ఒక వెయ్యి వెనకేశాక వెల్లూరు తీసుకెళ్లాను... అప్పటికే ఆలస్యమై పోయిందన్నారు. ఎన్నో వైద్యాలు చేయించాను. వాడికి కాళ్లు రాలేదు. తిరిగి ఈ ఊరు వస్తున్నప్పుడు నాలో నేనే అనుకున్నాను. ఒక ప్రతిజ్ఞలాగ – వాడికి లేని సుఖానికి నేనుకూడా ఆశపడకూడదని. వాడిలాంటి కష్టజీవులకోసం బతకడమే నాకు మిగిలిన జీవిత లక్ష్యం, నాకు ప్రేమ, పెళ్ళి లేవు. వాటికి నాకు అర్హత లేదు."

కాముడు తడి కళ్ళతో అతని వంక చూసింది.

"ఆయనకింక కాళ్ళు రావడానికి అవకాశమే లేదా?"

"వైద్యశాస్త్రంలో ఏమీ లేదు. ఎందరో పాశ్చాత్య నిపుణులకు రాయించాను, మా ప్రొఫెసర్లచేత. అందరూ అదే అన్నారు. ఆత్మబలం, ఆత్మవిశ్వాసంవల్ల ఇటువంటి జబ్బులు కుదిరినట్లు కథలున్నాయి. ఎలిజబత్ బారెట్ అనే కవయిత్రికి రెండుకాళ్ళూ లేవట. బ్రౌనింగ్ మహాకవి కావ్యాలు చదివి అతన్ని చూడకుండానే ప్రేమించింది. అతనితో పరిచయమయాక ఆ ప్రేమ పెద్ద హృదయోద్వేగంగా మారిపోయింది. తన ప్రేమ సాఫల్యంకోసం ఆమె తహతహలాడింది. బ్రౌనింగ్ ఆమెలో జీవచైతన్యాన్ని, ఆత్మవిశ్వాసాన్ని నింపాడు. ఆమెకు కాళ్లొచ్చాయి. బ్రౌనింగ్‌ని ఆమె పెళ్లాడింది."

ఆ తరవాత ఇద్దరూ చాలాసేపు మౌనంగా కూర్చున్నారు. ఎవరి ఆలోచనలు వారివి. తూర్పు తెల్లబడుతుంటే లేచింది, కాముడు, ఆమె ముఖంలో వింతవెలుగు డాక్టర్ గుర్తించనేలేదు.

కుంజుం నాయర్ అన్నయ్యగారి కాళ్ళకు తైలమేదో మర్దనా చేస్తుంటే అతి జాగ్రత్తగా చూసింది కాముడు. అతని చేతివేళ్ళు మొరటు. కాని, వాటిలో సున్నితమైన మెత్తదనం ఉంది. అవి లోపలి నరాలను స్పృశించి వాటికి చైతన్యం కలిగించడం ఆమె గుర్తించింది.

"నాయర్‌గారూ! నేనూ మర్దనా చేస్తాను. నాకు నేర్పండి" అంది.

నాయర్ పర్యవేక్షణ కింద ఆమె అన్నయ్యగారి కాళ్ళు తైలంతో మర్దనా చేసింది. అన్నయ్యగారి అచేతనమైన కాళ్ళు ఆమె చేయి తగలగానే కాస్త ముడుచుకుపోవడానికి ప్రయత్నించడం నాయర్ గుర్తించాడు.

"డాక్టర్‌గారు! అమ్మాయి చెయ్యి మంచిది. ఇంక నేను రానక్కర్లేదు' అని చెప్పి వెళ్ళిపోయాడు నాయర్.

ప్రతిరోజు ఆ గదిలో ఇద్దరే – అన్నయ్యగారూ, కాముడూ, డాక్టర్ మాత్రం ఆత్రంగా తలుపు చీలికలలోంచి చూస్తుంటాడు.

"ముడవండి. కుడికాలు ముడవండి."

"ఎందుకు కదలదు? ప్రయత్నించండి. ఊఁ, కదులుతోంది."

కాముడు అరికాలు గోకుతుంది. ఏదో అతనికి తెలియని నరం లోలోపల కదులుతుంది. కాలి కొసనించి గుండెలదాకా, నరాలకు ఏదో జ్ఞానం, ఏదో బలం

కొలవడానికి గుండె ఆత్రంగా ప్రయత్నిస్తుంది. కాలు మేలుకోవాలని తహతహ లాడుతుంది. వయసు మేలు కోవాలని మనసు ఉబలాటపడుతుంది.

"లేవండి"

"నేనా!!!"

"ఊఁ నా చెయ్యి పట్టుకు లేవండి."

అన్నయ్యగారు ఒక్కక్షణం మెరిసే కళ్లతో ఆమెవంక చూశారు. చెయ్యి పట్టుకున్నారు. పట్టుదలతో లేవడానికి ప్రయత్నించారు. అవతలినించి డాక్టర్ ఆత్రంగా చూశాడు. కాస్త లేవగలిగారు అన్నయ్యగారు, బరువంతా ఆమెమీద మోపి – ఊపిరి బిగబట్టి ఆమె ఆసరా ఇచ్చింది. అన్నయ్యగారి కాళ్లు ముడుచుకున్నాయి. కొంచెం. ఒక్క ఆరంగుళాలు ఆయన పిరుదులు నేలను వదిలి పైకి లేచాయి. కాముడు ప్రాణాలు బిగబట్టి నిలబడింది. అన్నయ్యగారి కాళ్ళూ, కాముడూ కూడా ఆ ప్రయత్నంలో అలసిపోయాయి. ఆమె తూలి ఆయన మీద పడిపోయింది. నిస్పృహతో ఆయన నిట్టూర్చారు. ఆమె లేచి పక్కని కూర్చుంది.

"లాభం లేదు. నీ ప్రయత్నమంతా వృథా."

"అదేమిటి మీరు అడుగు లేచారు... తెలుసా?"

ఆ మాట తన సంతృప్తికోసం ఆమె అనలేదని అన్నయ్యగారికి అర్థమైపోయింది. ఆమె కళ్ళలో ఆశ రప్పున వెలిగింది. అన్నయ్యగారిలో ఎక్కడో చీకటి కోణాన్ని అది వెలిగించింది.

రాత్రి కలత నిద్రలో ఉన్న కాముడు కుదిపి లేపింది. నిద్రా, మెలుకువా కాని స్థితిలో, "ఊఁ నడవండి" అంది కాముడు.

"అదే ప్రయత్నిస్తున్నాడు అన్నయ్య. రా. వచ్చి చూడు" అన్నాడు డాక్టర్.

ఆమెకు మెలకువ వచ్చింది. ఆత్రంగా లేచింది. ఇద్దరూ గది అవతల చీకట్లో నిలబడ్డారు. లోపల వీధి దీపం వెలుగు కిటికీలోంచి అన్నయ్యగారి మంచంమీద పడుతోంది. మంచంపట్టె పట్టుకొని ఆయన వంగి నిలబడి ఉన్నారు. బరువంతా చేతులు మీద ఆన్చి. మెల్లిగా చేతులు మంచం పట్టెనించి తీసేసారు నిటాగ్గా నిలబడడానికి ప్రయత్నించారు. ఒక్కక్షణం రెండు కాళ్ళూ ఆయన బరువు మోశాయి. ఒక్క లిప్త చటుక్కుని కలువకాడల్లా ముడుచుకుపోయాయి. ఆయన కూలబడిపోయారు. కాముడు డాక్టర్ని తలుపు పక్క చీకట్లోకి తోసింది. లోపలికొచ్చి దీపం స్విచ్ వేసింది అన్నయ్యగారు చటుక్కున వచ్చిన వెలుగు చూడలేక కళ్లు చికిలించారు. దేవతలాగ వెలుగు వెదజల్లుతూ గుమ్మంలో నిలబడ్డ కాముణ్ణి చూశారు నవ్వారు, చిన్నగా.

"లేవండి"

చేతకాదన్నట్టు తల అడ్డంగా ఊపారు అన్నయ్యగారు.

"లేవగలరు. ఊఁ లేవండి... ఆ మంచం పట్టె మీద చేతులెందుకు? ఊఁ లేవాలి. లేచి తీరాలి."

మంత్రముగ్ధుడిలా అన్నయ్యగారు లేచారు ఏదో దివ్యశక్తి ఆజ్ఞ పాలిస్తున్నట్టు, కాళ్లు సడలిపోలేదు."

"రండి నా దగ్గరకు రండి ఊc – నేను రాను... మీరే రావాలి."

అన్నయ్యగారు రెండు తప్పటడుగులు వేశారు. తూలిపోబోయారు. ఆమె ఒక్క అడుగు ముందుకు కదలలేదు. అప్పుడే అడుగులు నేర్చుకుంటున్న చంటిపిల్ల వాడిలా పడిపోకుండా నిలదొక్కుకున్నారు. ఆమె కళ్లలో మూడు నాలుగు, అయిదు, ఆమె భుజాల చేతులు ఆన్చి ఆయన నిలబడిపోయాడు. మరొక్క అడుగు. పిచ్చి ఆవేశంలో ఆమెను గుండెలకు హత్తుకున్నారు.

"నడిచాను. నాకు కాళ్ళొచ్చేశాయి. నేను నడిచాను, కాముడూ!"

గుమ్మం అవతల చీకట్లో డాక్టర్ ఆనందంలో అలసిపోయాడు. నిలబడలేక కూర్చుండిపోయాడు.

వారం రోజులు కాముడు అన్నయ్యగారికి నడవడంలో తరిఫీదు ఇచ్చింది. ఇప్పుడాయన తూలిపోవడంలేదు. సన్నని కాళ్లింకా పూడలేదు. కాని. వాటికి సంకోచం లేదు, ఆయన కాస్త గోడ ఆసరాతో ఇంట్లో తిరుగుతున్నారు.

కాముడు వీధివైపు ఆవరణలో సిమెంటు తిన్నెమీద కూర్చుంది. గాలి కదలడంలేదు. మూడవ జాము నిద్రలో పట్నం కాస్త కదులుతూంది. చటుక్కుని కాముడి కల కరిగిపోయింది. చటుక్కుని డాక్టరు ఆమెను గాఢంగా గుండెలకు హత్తుకున్నాడు. ఆమె కదలలేక ఆ కౌగిలిలో అలాగే ఉండిపోయింది. డాక్టరు ఆవేశంలో, ఆనందంతో అంటున్నాడు.

"కాముడూ! మన ఇద్దరి మధ్యా అడ్డు గోడ తొలగిపోయింది. అన్నయ్యకి కాళ్ళొచ్చాయి. వాడు మళ్లీ మనిషయ్యాడు. మన ప్రేమ ఫలిస్తుంది. రేపే అన్నయ్యకి చెప్పేస్తాను. మనిద్దరం పెళ్లి చేసుకుంటున్నామని, కాదు, మనకిద్దరికీ పెళ్ళి చెయ్యమని.

కాముడు దిగ్భ్రమలోంచి తేరుకుంది. డాక్టరు గుండెలమీద తల ఆన్చి వలవల ఏడ్చింది. గుండె పగిలేటట్టు. డాక్టరు బొమలు ముడివేసి ఆమెవంక ప్రశ్నార్థకంగా చూసాడు. కాముడు ఏడుపు ఎగువులలోంచే అంది.

"మీకింకా అర్థం కాలేదా? అన్నయ్యగారు ఎలా నడవగలిగారో ఎందుకు నడవాలని అంత పట్టుదలగా ప్రయత్నించి సాధించారో... నాకోసం... నన్ను తనదాన్ని చేసుకోవాలన్న బలమైన కోరిక ఆయన్ని ఆవహించింది."

డాక్టరు పిడుగు పడ్డట్టు నిలబడిపోయాడు. 'దబ్బు' మన్న శబ్దం అతన్ని మళ్లీ ఈ లోకంలోకి తీసుకొచ్చింది. కాముడు 'అయ్యో' అంటూ పరుగెత్తింది.

అన్నయ్యగారు అరుగు పక్కన పడిపోయాడు. తలకి బలంగా దెబ్బ తగిలింది.

మెలకువ వచ్చేసరికి ఆయన మంచంమీద ఉన్నారు. డాక్టరు ఆవేశంతో అన్నాడు.

"అన్నయ్యా! కాముడికీ, నీకూ పెళ్ళికి రేపే ఏర్పాటు చేసేస్తున్నాను."

అన్నయ్యగారు చీకట్లో నిలబడి ఉన్న కాముడి వంక చూశారు. నవ్వారు.

"కాముడికీ, ఈ కాళ్ళు లేని వాడికీ పెళ్ళేమిట్రా... ఏదో కాస్త కాళ్ళు వస్తున్నట్టు అనవసరంగా ఆశ పుట్టింది. వచ్చినట్టే వచ్చి కాళ్ళు మళ్లీ పోయాయి. ఇంక రావు. ఎవరెంత ప్రయత్నించినా కాళ్ళు మళ్లీ రావు. రావు."

ఆయన మళ్లీ మగతలో మునిగిపోయారు.

డాక్టరు మంచం పక్కని కుర్చీలో నిద్రపోతున్నాడు. మంచంమీద అన్నయ్యగారు. నిరాశలాంటి మగతలో నిర్జీవ ప్రతిమలా పడుకున్నారు. కాముడింక ఆ ముఖం చూడలేకపోయింది.

తన ట్రంకు పెట్టె తీసుకుంది. మెల్లగా వీధి గుమ్మం వంక నడిచింది. తలుపుమీద అన్నయ్యగారి దస్తూరీతోఉన్న 'ఈ తలుపులు మూతపడవు' అన్నవాక్యం చదువుకుంది. చేత్తో ఆప్యాయంగా ఆ వాక్యం తడిమింది. చటుక్కుని గుమ్మం ఇవతలికి కదిలింది.

అవతల కారు చీకటి. తెల్లవారబోయే ముందు మరీ దట్టంగా చిక్కబడిన చీకటి.

(ఆంధ్రప్రభ వారపత్రిక - 11.4.73)